క్లుప్తంగా

డీఈవో ఆకస్మిక తనిఖీ



హెచ్‌బీ కాలనీ పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో లంక చంద్రకళ

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు హెచ్‌బీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను డీఈవో లంక చంద్రకళ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతుల్లో ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. తరగతుల నిర్వహణపై ఆరా తీశారు. సీబీఏ -1 పరీక్ష పేపరును పరిశీలించారు. ప్రోగ్రెస్ రిపోర్టులు, సిలబస్ పూర్తి గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల వర్క్‌బుక్‌లను పరిశీలించారు. చదువులో వెనుకంజలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఈవో సూచించారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



వాజ్‌పేయి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీ కాలనీ: దివంగత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా నగర బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర ఆధ్వర్యంలో లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీ పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జి ఎస్‌వీఎస్ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానిగా వాజ్‌పేయి దేశ రూపరేఖలు మార్చారన్నారు. పెద్ద ఎత్తున జాతీయ రహదారులను అభివృద్ధి చేసి దేశంలోని అన్ని ప్రాంతాలను భౌతికంగా కలిపారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శిగా గోవింద్



మద్దిలపాలెం : ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శిగా పడాల గోవింద్ ఎన్నికయ్యారు. రెండు రోజుల పాటు నగరంలో జరిగిన ఏఐటీయూసీ మహాసభలో ఈ మేరకు గోవింద్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు పోరాటాలు చేస్తానన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై పోరాటం ఉధృతం చేస్తామన్నారు.

కృష్ణా డిగ్రీ కళాశాలలో పోటీ పరీక్షలకు శిక్షణ



శిక్షణ కార్యక్రమాన్ని వివరిస్తున్న అధ్యాపకుడు సామ్యూల్ డేవిడ్ రాజ్

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలో పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ సెల్ కో-ఆర్డినేటర్ సామ్యూల్ డేవిడ్ రాజు తెలిపారు. కళాశాలలో బుధవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ మేరకు ఇండియన్ అకాడమీ ఆఫ్ కాంపిటేటివ్ ఎగ్జిమినేషన్స్‌తో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు ఒప్పందం చేసుకున్నారని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న దర్యాప్తు

ఎంవీపీ కాలనీ: పిఠాపురం కాలనీలో మంగళవారం రాత్రి జరిగిన హత్య కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. రాంబాబు దాడి చేయడంతో నారాయణ మృతి చెందాడని, నిందితుడి కోసం గాలిస్తున్నట్లు ఎంవీపీ పోలీసులు బుధవారం తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుంటే గానీ హత్యకు గల కారణాలు పూర్తిగా తెలియవన్నారు.

శ్రావణ మాస పూజలకు వేళాయె

- ముస్తాబైన అమ్మవారి ఆలయాలు
- నేటి నుంచి శ్రావణ మాసం ఆరంభం

ఏయూ క్యాంపస్: మహిళలు ఎంతో భక్తి ప్రపత్తులతో మహాలక్ష్మి అమ్మవారిని కొలిచే శ్రావణ మాసం గురువారం నుంచి ప్రారంభం కానుంది. నిత్య పూజలతో పాటు శుక్రవారం నాడు విశేష పూజలు జరుపుతారు. ఇప్పటికే ఆలయాలు శ్రావణ శోభను సంతరించుకుని ముస్తాబయ్యాయి. ప్రత్యేక పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. భక్తుల దర్శనానికి అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు ఆయా ఆలయ నిర్వాహకులు, అధికారులు చేశారు. ఈ ఏడాది ఈ మాసంలో ఐదు శుక్రవారాలు రావడం విశేషం.



పోలమాంబ ఆలయం(ఇన్‌సెట్) అమ్మవారు

పోలమాంబ ఆలయంలో..

పెదవాల్తేరులో కొలువైన 14 గ్రామాల ఆరాధ్య దైవం పోలమాంబ ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని ఐదు శుక్రవారాలూ భక్తుల గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో డి.వి.ఎస్.సురేష్ బాబా తెలిపారు. ఇందు కోసం రూ.350 చెల్లించి రశీదు తీసుకోవాలన్నారు. వీరికి ప్రతి శుక్రవారం ప్రసాదం అందిస్తామన్నారు. ఈ నెల 31న శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఎటువంటి రుసుం చెల్లించకుండా పాల్గొనవచ్చు. అలాగే ఆలయంలో అమ్మవారికి నెల రోజుల పాటు నిత్యం తమ గోత్రనామాలతో పూజలు నిర్వహించే ఏర్పాటు చేశారు. దీనికి రూ.350 చెల్లించాలి. నెల రోజుల పూజలు జరిపి నెలాఖరున అమ్మవారి ప్రసాదం అందిస్తారు. అదే విధంగా ప్రతి పౌర్ణమి, అమావాస్య రోజుల్లో రూ.1500 చెల్లించి చండీ హోమంలో స్వయంగా భక్తులు పాల్గొనవచ్చునని ఈవో తెలిపారు.

లలితా త్రిపురసుందరి పీఠంలో..

శ్రావణలక్ష్మీ స్వరూపమైన శ్రీలలితా త్రిపురసుందరీ పీఠంలో గురువారం నుంచి సెప్టెంబరు 15 వరకు విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు కాందూరు లక్ష్మణ స్వామి తెలిపారు. ఏయూ అవుట్ గేట్ సమీపంలోని ఆలయంలో శ్రావణమాసం నెల రోజులు అమ్మవారికి భక్తుల గోత్రనామాలతో కోటి కుంకుమార్చన నిర్వహిస్తామన్నారు. నెలలో ఒక రోజు భక్తులు స్వయంగా కోటి కుంకుమార్చనలో పాల్గొనవచ్చునన్నారు.



లలితా పీఠంలో పూజలు చేస్తున్న భక్తులు

పుష్పాలకు డిమాండ్



పెదవాల్తేరు రైతుబజార్‌లో రద్దీగా పువ్వుల స్టాల్

ఏయూ క్యాంపస్: శ్రావణ మాసం ప్రారంభంతో పువ్వులకు డిమాండ్ పెరుగుతోంది. గురువారం నుంచి శ్రావణమాసం ఆరంభం కానుంది. ఈ మాసంలో శుక్రవారాలు విశేషంగా పూజలు చేస్తారు. ఇంట్లోతో పాటు ఆలయాల్లో పూజలు చేయడానికి నగరవాసులు పువ్వులను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. బుధవారం పెదవాల్తేరు రైతుబజార్‌లో పువ్వుల ధరలు ఇలా ఉన్నాయి. చామంతి దేశవాళీ, హైబ్రిడ్ రకాలు కిలో రూ.450, గులాబీ హైబ్రిడ్ కిలో రూ.300, బంతి పూల దండలు రూ.25 నుంచి రూ.30, మల్లె పువ్వులు కిలో రూ.450, మూర రూ.30, కనకాంబరాలు కిలో రూ.1000, మూర రూ.30, విరజాజులు కిలో రూ.250, మూర రూ.25, కాగడ మల్లె మూర రూ.25, లిల్లీ కిలో రూ.200, బంతి పూలు కిలో రూ.150, తులసిమాల రూ.20, నందివర్ధనం 50 పువ్వులు రూ.10, మందారం 20 మొగ్గలు రూ.10కు విక్రయిస్తున్నారు. రానున్న రోజుల్లో ఇవి మరింత పెరిగే అవకాశం ఉంది. పువ్వులతో పాటు కొబ్బరి కాయలు, అరటి పండ్లు, తమలపాకులకు సైతం డిమాండ్ పెరుగుతోంది. నెల రోజుల పాటు వీటి విక్రయాలు గణనీయంగా ఉంటాయని రైతులు చెబుతున్నారు.

ఉత్సాహంగా క్రిస్టియన్ సింగింగ్ చాంపియన్‌షిప్



విజేతలకు చెక్కులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు జాన్ వెస్లీ

ఆరిలోవ: క్రైస్తు గోస్పెల్ చర్చి ఆధ్వర్యంలో సిరిపురం వద్ద గురజాడ కళాక్షేత్రంలో బుధవారం మెగా యూత్ రిట్రీట్ క్రిస్టియన్ సింగింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పలువురు గాయకులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. కౌన్సిల్ ఫర్ రిఫార్మ్‌డ్ చర్చిస్ ఇన్ ఇండియా ఆర్చి బిషప్ జి.విజయరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్‌వెస్లీ ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలకు చెక్కుల రూపంలో నగదు బహుమతులు అందజేశారు. అనంతరం వెస్లీ మాట్లాడుతూ భక్తి గీతాలు ఆలపించడం అంటే దేవుని పూజించడమేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్‌సీఎంఎఫ్‌సీ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.శేఖర్, బిషప్‌లు ఎం.ఎ.పాల్, కె.ఆర్.సింగ్, ప్రవీణ్, టాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్ గిడియన్ కట్ట, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగునీరు ప్రవాహం



రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డు గాంధీ బొమ్మ సెంటర్ నుంచి నిరాశ్రయుల వసతి గృహానికి వెళ్లే మార్గంలో యూజీడీ వ్యవస్థ దెబ్బతింది. దీంతో మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. ఉదయం నుంచి యూజీడీ నుంచి వస్తున్న మురుగునీరు రోడ్డుపైకి రావడంతో వాహన చోదకులు, స్థానికులు నానా అవస్థలు పడ్డారు. తరచూ పలు ప్రాంతాలలో యూజీడీ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వ్యర్థాలు అడ్డుపడడంతో మురుగునీరు రోడ్డుపైకి ప్రవహిస్తోంది. జీవీఎంసీ సిబ్బంది స్పందించి యూజీడీ పైపులైన్‌ను సరిచేయాలని కోరుతున్నారు.

బీసీలకు గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం



గౌతు లచ్చన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీడీ శ్రీదేవి తదితరులు

ఎంవీపీ కాలనీ: బీసీల సంక్షేమానికి సర్దార్ గౌతు లచ్చన్న అందించిన సేవలు చిరస్మరణీయమని జిల్లా బీసీ సంక్షేమ శాఖ డీడీ శ్రీదేవి తెలిపారు. గౌతు లచ్చన్న 115వ జయంతి కార్యక్రమం ఎంవీపీ కాలనీలోని గౌతు లచ్చన్న బీసీ స్టడీ సర్కిల్‌లో బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా డీడీ శ్రీదేవితో పాటు బీసీ సంఘాల నాయకులు, స్టడీ సర్కిల్ ఉద్యోగులు గౌతు లచ్చన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీడీ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం లచ్చన్న అహర్నిశలు శ్రమించారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

చెత్త తరలించారు..



ఉమానగర్‌లో తొలగించిన యూజీడీ వ్యర్థాలు

సాక్షి ఎఫెక్ట్..

మద్దిలపాలెం : జీవీఎంసీ 15వ వార్డు ఉమానగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ నుంచి తీసిన వ్యర్థాలను ఎట్టకేలకు తరలించారు. 20 రోజుల క్రితం యూజీడీకి మరమ్మతులు చేపట్టిన సమయంలో తీసిన వ్యర్థాలను రోడ్డుపై వదిలేశారు. దీంతో దుర్గంధంతో పాటు రాకపోకలకు కాలనీవాసులు నానా అవస్థలు పడ్డారు. దీనిపై «చెత్త తరలింపులో అలసత్వం»శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. హుటాహుటిన ఉమానగర్‌లో పేరుకుపోయిన యూజీడీ వ్యర్థాలను తొలగించి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఉమానగర్ కాలనీవాసులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

నాణ్యమైన కూరగాయలే విక్రయించాలి



స్టాల్ టోకెన్ అందిస్తున్న షేక్ యాసిన్

సీతమ్మధార: రైతుబజారులో ఎవరైనా డ్రాలో మీకు స్టాల్ వచ్చేలా చేస్తానని చెప్పిన తక్షణమే తమకు సమాచారమివ్వాలని జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ సూచించారు. సీతమ్మధార రైతుబజారును బుధవారం ఆయన సందర్శించారు.

రైతుల స్టాళ్ల వద్దకు వెళ్లి ఐడీ కార్డులను, ఉల్లిపాయలు, టామాటాల నాణ్యతను, ధరల పట్టికలను పరిశీలించారు. యాసిన్ పర్యవేక్షణలో రైతుల స్టాళ్లకు డ్రా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరల ప్రకారం నాణ్యమైన కూరగాయలను విక్రయించాలని సూచించారు. సమస్యలేమైనా ఉంటే తక్షణమే 73311 54978 నంబర్‌కు కాల్ చేయాలని రైతులతో సూచించారు. ప్రతి వారం రైతుల స్టాళ్లకు తానే వచ్చి డ్రా తీస్తానని చెప్పారు. కార్యక్రమంలో రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్, రైతులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్సాక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989కు వాట్సాప్ చేయాలి.

ప్రతి రోజూ కాలువల శుభ్రత

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఆదేశం
- జోన్–3లో క్షేత్రస్థాయి పర్యటన



బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో పర్యటిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ, కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు

సీతమ్మధార: వర్షా కాలం దృష్ట్యా నగరంలోని ప్రధాన కాలువలతోపాటు చిన్న చిన్న కాలువలను ప్రతి రోజూ శుభ్రం చేయాలని ప్రజారోగ్య అధికారులను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. జోన్–3 పరిధి 14వ వార్డులోని సీతమ్మధార, రామకృష్ణరాజునగర్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, పోర్టు స్టేడియం పరిసర ప్రాంతాల్లో బుధవారం కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజుతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డులో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించడం లేదని, చెత్త కుప్పలు ఎక్కడికక్కడ కనిపిస్తున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసి, వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. యూజీడీ కనెక్షన్లతోపాటు అల్లూరి సీతారామరాజు విగ్రహం జంక్షన్ వద్ద కల్వర్టు మరమ్మతులను వారం రోజులోగా పూర్తి చేయాలని, రామకృష్ణనగర్‌లో కల్వర్టు నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని, పోర్టు అధికారులతో మాట్లాడి నరసింహనగర్ రైతుబజార్ రోడ్డును 60 నుంచి 80 అడుగులకు విస్తరించేలా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.

ఆకర్ష జోన్ ఏర్పాటు చేయండి

23వ వార్డు పరిధిలోని సీతమ్మధారలో కమిషనర్ సాయికాంత్ వర్మ పర్యటించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలం నుంచి రైతు బజార్ వరకు ఆకర్ష జోన్ ఏర్పాటు చేసి తోపుడు బళ్ల వ్యాపారులకు కేటాయించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులకు ఆదేశించారు. పర్యటనలో టౌన్ ప్లానింగ్ అధికారి సునీత, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, ఈఈ సత్యనారాయణరాజు, ఏఎంహెచ్‌వో రాజేష్, కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశేషంగా అమావాస్య తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం: అమావాస్య పురస్కరించుకుని బుధవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి తిరువీధి వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి పల్లకిలో అధిష్టంపజేసి సింహగిరి మాఢ వీధుల్లో తిరువీధి ఘనంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, పారాయణదారులు, పండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

కాల భైరవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



కాల భైరవస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మద్దిలపాలెం : కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని కాల భైరవస్వామి ఆలయంలో అమావాస్య సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కాల భైరవ స్వామి దర్శించుకున్నారు. ప్రతి అమావాస్య రోజున ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని అర్చకుడు భాస్కరశర్మ తెలిపారు.

'ఎల్వీపీ' లో హోం కేర్ సేవలకు శ్రీకారం



హోం కేర్ సేవల ప్రారంభోత్సవంలో హీరోయిన్ శ్రీలీల, ఎల్వీపీ వైద్యులు, ఫౌండేషన్ సభ్యులు

ఆరిలోవ: ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాలలో హోంకేర్ వైద్యం అందుబాటులోకి వచ్చింది. స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్న హోం కేర్ సేవలను సినీ హీరోయిన్ శ్రీలల బుధవారం ఎల్వీపీ కంటి ఆస్పత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్వీపీ నేత్ర వైద్యశాల నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ అవినాష్ పతంగే మాట్లాడుతూ వృద్ధాశ్రమంలో ఉన్నవారికి, హనుమంతవాక వద్ద ఆస్పత్రి నుంచి నగరంలో 20 కిలోమీటర్లు పరిధిలో ఉన్న ప్రజలకు ఈ హోం కేర్ సేవలు అందించనున్నట్లు తెలిపారు. అవసరమైనవారి ఇంటికి కిట్ కలిగిన బాక్స్‌తో వెళ్లి వైద్య సిబ్బంది సేవలు అందిస్తారన్నారు. అందరికీ ఈ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధులు ఐ.ఎస్.ఎన్.రాజు, సాంబశివరావు, సింబయాసిస్ అధినేత ఒ.నరేష్ కుమార్, ఎల్వీపీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు వైద్యం చేయడం ఇష్టం: శ్రీలీల

పేదలకు వైద్య సేవలు అందించడం అంటే నాకు చాలా ఇష్టమని హీరోయిన్ శ్రీలీల తెలిపారు. డాక్టర్ కోర్సు చదువుకున్న తాను పేదలకు ఉచితం వైద్య సేవలు అందించడంలో సంతృప్తి ఉంటుందని భావిస్తానన్నారు. ఇంటికి వెళ్లే కంటి వైద్య సేవలు అందించడం మంచి ఆలోచన అని ఆమె అభిప్రాయపడ్డారు. అందుకే ఈ కార్యక్రమానికి తాను స్వతహాగా హాజరైనట్టు తెలిపారు. ఈ హోం కేర్ ద్వారా వృద్ధాశ్రమాల్లో పేదలకు ఉచితంగా సేవలు అందించడం అభినందనీయమన్నారు.

ఏయూ సమాచారమ్

ఫొటోగ్రఫీ ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

ఏయూ క్యాంపస్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వాల్తేర్ ఫొటోగ్రఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ ప్రదర్శన జరగనుంది. ఈ నెల 19, 20 తేదీల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రాంగణంలో నిర్వహించే ఈ ప్రదర్శన వివరాలతో కూడిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి బుధవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పి.ఎస్.సేతు, కార్యదర్శి ఎం.వి.శ్రీనివాసరెడ్డి, కోశాధికారి వి.వి.రామరాజు, సభ్యులు కె.ఎం.కె.రమేష్, నన్నీ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఆరుగురు యువకులపై దాడి కేసు

ఆరిలోవ: అర్ధరాత్రి సమయంలో ఓ వ్యక్తిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడిన యువకులను ఆరిలోవ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎండాడలో స్టోన్ వాటర్ బార్ అండ్ రెస్టారెంట్‌లో షేక్ రోహిజ్ పని చేస్తున్నాడు. అతనితో పాటు పని చేస్తున్న మరో ఐదుగురు కలసి ఎండాడ దరి రాజీవ్‌నగర్‌లో ఉంటున్నారు. వారంతా రెండు రోజుల క్రితం విధులు ముగించుకుని అర్ధరాత్రి సమయంలో బార్ నుంచి ఇంటికి బయలుదేరారు. ఆ సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలపై వచ్చిన మరో ఆరుగురు యువకులు వారిని అడ్డగించారు. వారి వద్ద ఉన్న డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓ యువకుడి జేబులో రూ.2 వేలు నగదు తీసుకున్నారు. అంతటితో ఆగకుండా రాళ్లు, కర్రలతో దాడి చేశారు. షేక్ రోహిజ్ ముఖం, తలపై గాయపరిచారు. పెద్దగా కేకలు వేస్తూ వీరంగం వేశారు. దీంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు వచ్చి వారిని అడ్డుకోవడానికి ప్రయతించారు. వారిని సైతం పక్కకు నెట్టేసి అక్కడి నుంచి పరారయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో 108 అంబులెన్స్ సిబ్బంది చేరుకుని గాయపడిన రోహిజ్‌కు ప్రథమ చికిత్స చేసి గీతం ఆస్పత్రికి తరలించారు. బాధితుడు రోహిజ్ ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. దాడి చేసిన ఆరుగురు యువకులను గుర్తించారు. వారు కూడా రాజీవ్‌నగర్‌కు చెందిన వారేనని సీఐ తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

స్టీల్ డిపో యాజమాన్యం వైఖరి మార్చుకోవాలి



మద్దిలపాలెం డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం : ఆర్టీసీ స్టీల్ డిపో యాజమాన్యం సిబ్బందిపై వ్యవహరిస్తున్న నిరంకుశ వైఖరిని మార్చుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నీలకంఠం డిమాండ్ చేశారు. చలో ఆర్ఎం కార్యాలయం కార్యక్రమంలో భాగంగా మద్దిలపాలెం ఎన్ఎంయూఏ కార్యాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ డిపోలో అపరిష్కృతమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. దీనిపై 34 రోజులుగా దీక్షలు చేస్తున్నా యాజమాన్యం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం ర్యాలీగా మద్దిలపాలెం నుంచి ద్వారకానగర్‌లోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న ఆర్ఎం కార్యాలయానికి తరలివెళ్లారు.

ముగిసిన శ్రీవారి శ్రావణ సంగీతోత్సవాలు

ఎంవీపీ కాలనీ: విశాఖ సాగర తీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి శ్రావణ సంగీతోత్సవాలు బుధవారం ముగిశాయి. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపం వేదికగా కొద్ది రోజులుగా సంగీతోత్సవాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సవాల్లో భాగంగా నగరంలో పలు మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీలకు చెందిన చిన్నారులతో పెద్ద ఎత్తున సంగీత, నృత్య కార్యక్రమాలు నిర్వహించారు. సాంస్కృతిక, సంగీత, నృత్య ప్రదర్శనలతో పాటు వ్యాస రచన, చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బుధవారం జ్ఞాపికలు, పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్‌లో జగదీష్‌కు ద్వితీయ స్థానం



విద్యార్థి జగదీష్‌కు ట్రోఫీ అందజేస్తున్న బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: గైన్స్ ఫిట్‌నెస్ క్లబ్ నిర్వహించిన మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో లంకపల్లి బుల్లయ్య కళాశాలకు చెందిన విద్యార్థి వి.జగదీష్ 85 కిలోల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా బుధవారం జగదీష్‌ను కళాశాల కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించి ట్రోఫీని అందజేశారు. కళాశాల ప్రిన్సిపాళ్లు జి.ఎస్.కె.చక్రవర్తి, డి.దీపక్ చౌదరి, కె.సోమేశ్వరరెడ్డి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ బి.ఆర్.ఎస్.లక్ష్మణ్‌రెడ్డి అభినందనలు తెలిపారు.

మహిళా వాద రచయిత చలం

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ప్రసంగ కార్యక్రమంలో 'చలం జీవితం, సాహిత్యం' అనే అంశంపై రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు కుప్పిలి భీమేశ్వరరావు ప్రసంగించారు. మహిళల జీవితాలను ఇతివృత్తంగా చేసుకుని వారికి స్వేచ్ఛ అవసరమని, సమాజంలో వారికి ఎదురయ్యే శారీరక, మానసిక హింసలను చలం తన రచనల్లో ఎత్తిచూపారన్నారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ చలం రచనలు 1920–50 మధ్య సమాజాన్ని ప్రభావితం చేశాయన్నారు.